క్లుప్తంగా

ఎమ్మెల్యే కన్నబాబుకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే కన్నబాబుకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేస్తున్న రవి

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కాకినాడ రూరల్ మండల వైఎస్సార్ సీపీ నాయకుడు లింగం రవి ఆదివారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికకు సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలయజేశారు.

దుస్తుల పంపిణీ



కరపలో పేదలకు దుస్తులు అందజేస్తున్న మాజీ సర్పంచ్ తదితరులు

కరప: గ్రామంలోని మెరకవీధి రామాలయం వద్ద ఆదివారం భోగిపండగను పురస్కరించుకుని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ సమకూర్చిన దుస్తులను పేదలకు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు పంపిణీ చేశారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ నక్కా వీరభద్రరావు, గ్రామస్తులు నక్కా సత్యనారాయణ, దేవు వెంకన్న, నక్కా శ్రీనుబాబు, పాట్నీడి సూరిబాబు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత



బహుమతులు అందజేస్తున్న నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ సత్యనారాయణ

కాకినాడ రూరల్: వాకలపూడి గ్రామంలో జీఎఫ్‌సీఎల్ కాలనీలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పాల్గొని విజేతలకు బహుతులు అందజేశారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నాయకుడు,. జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ కరీంబాషా ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా మహిళలకు ముగ్గులు పోటీలు, మ్యూజికల్ చైర్మన్ స్పూన్ అండ్ లెమన్ తదితర ఆటలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గొల్లపల్లి జగన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి క్రికెట్ టోర్నీ లీగ్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఏకే అధ్యక్షుడు మధువీరేష్, వైస్ ఎంపీపీ భీమేశ్వరరావు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సీఏకే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్‌లో వార్మప్ పోటీలు ముగియగా ఆదివారం లీగ్‌పోటీలను జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు, సీఏకే అధ్యక్షుడ దేవు మధువీరేష్ ప్రారంభించారు. ఈనెల 12న ప్రారంభించిన సంక్రాంతి క్రికెట్ టోర్నీలో వార్మప్ పోటీలలో 18 జట్లు పాల్గొనగా రెండుజట్లు లీగ్‌దశ పోటీలకు క్వాలిఫై అయ్యాయని నిర్వాహకుడు మధువీరేష్ తెలిపారు. లీగ్‌దశలో 8 జట్లు పోటీపడుతున్నట్టు ఆయన చెప్పారు. వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి రమేష్, నక్కా భీమ్, గోన శివ, దేవు శివ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు



సత్యనారాయణమూర్తి ఇంటిలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

బోట్‌క్లబ్: సంక్రాంతి సందర్భంగా ప్రముఖ న్యాయవాది వక్కలంక సత్యనారాయణమూర్తి, వాణిశ్రీ దంపతులు శ్రీనివాస్‌నగర్ ఎస్‌బీఐ బ్యాంకు కాలనీలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు నగర ప్రజలను ఎంతగానో ఆకట్టుకొంటుంది. 15 ఏళ్లుగా బొమ్మల కొలువును ఏర్పాటు చేస్తున్నారు. వేలాది బొమ్మలు కొలువుదీరగా చూపరులను కట్టి పడేసింది. స్థానికులు ప్రజలు, న్యాయవాదులు తిలకించారు. మూడు రోజుల పాటు ఈ బొమ్మలు కొలువు ఉంటుందని ఆయన తెలిపారు.



వేణుగోపాలస్వామి ఆలయంలో గోదా కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



కల్యాణం తిలకిస్తున్న భక్తులు



అష్టలక్ష్మీ ఆలయంలో గోదా కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కనుల వైకుంఠంగా గోదా కల్యాణం

బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రత మహోత్సవాలు భాగంగా ఆదివారం స్థానిక దేవాలయంవీధిలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పొందూరు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో గోదా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గోదా రంగనాథుని కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. పుణ్యాహవచనం, జీలకర్ర బెల్లం, శుభముహూర్తం, తలంబ్రాల ఘట్టాలు కనుల వైకుంఠంగా సాగాయి. కల్యాణం అనంతరం భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, 30 డివిజన్ మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు, శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈఓ వి. శ్రీనివాసరావు పట్టువస్త్రాలు సమర్పించారు. జగన్నాథపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలోను గోదా కల్యాణం మహోత్సవం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న అష్టలక్ష్మీ ఆలయంలో గోదా కల్యాణం వైభవంగా నిర్వహించారు. గాంధీ నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలోను, వేంకటేనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలోను, పళ్లంరాజు నగర్‌లోని ఆలయంలో జరిగిన గోదా కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంప్రదాయకంగా భోగి పండగ

కరప: మండలంలోని గ్రామ, గ్రామాన ఆదివారం భోగి పండగను ప్రజలు సంప్రదాయకంగా, ఘనంగా జరుపుకున్నారు. హరిదాసు హరినామ సంకీర్తనలతో మేలుకొలుపు పాడగా యువకులు, పెద్దలు కల్సి తెల్లవారు జామునే లేచి ముందుగా సేకరించి ఉంచిన దుంగలు, కలప, పిడకలతో భోగిమంటను వేశారు. చిన్నారులు ఉదయాన్నే తలస్నాన మాచరించి, కొత్త దుస్తులు ధరించారు. భోగిపిడకలతో తయారుచేసిన దండను చేత పట్టుకుని సందడి చేస్తూ భోగిమంటలో వేశారు. వృద్ధులు భోగిమంట వద్ద కూర్చుని చలి కాచుకున్నారు. చిన్నారులు భోగిమంటకు నమస్కరించి ఇంటికి వచ్చి సున్ని ఉండలు తిని నోరును తీపి చేసుకున్నారు. పిల్లలు, పెద్దలు ఒకరికొకరు కరచాలనం చేసుకుని భోగి పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు కొత్తదుస్తులతో వీధుల్లో తిరుగాడుతూ సందడి చేశారు. గృహాల్లో బంధువులు, కొత్తఅల్లుళ్లతో కల్సి ఇంటిల్లిపాది ఒకరిపై ఒకరు హాస్యోక్తులు విసురుకుంటూ, పిండివంటలు ఆరగిస్తూ సరదా కబుర్లతో, ఆటపాటలతో కాలక్షేపం చేశారు. మహిళలు, చిన్నారులు హౌసీ ఆటలతో ఉల్లాసంగా గడిపారు. కొంతమంది ఇరుగు పొరుగు వారిని, పేరంటాళ్లను పిలిచి తమ చిన్నారులకు భోగిపళ్లను పోయించారు. భోగిపండగ సందర్భంగా మద్యం దుకాణాలు కిటకిటలాడాయి. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు తమ ఇంటిముంగిట ఆకర్షణీయంగా రంగవల్లులు వేశారు.



కరపలోని ఒక వీధిలో వేసిన భోగి మంట



నడకుదురు సమీపంలోని ఒక లేఅవుట్‌లో నిర్వహిస్తున్న కోడిపందేలు



సర్పవరంలో ఘనంగా గోదాదేవి, భావనారాయణ స్వామి కల్యాణోత్సవం

జోరుగా సాగిన కోడిపందేలు

సంక్రాంతిని పురస్కరించుకుని కోడిపందేలు, గుండాట జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామంటామని పోలీసులు విస్తృతంగా ప్రచారం చేసి, హెచ్చరికలు జారీచేశారు. కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది సంప్రదాయ ఆటలే ముద్దు, జూద క్రీడలు వద్దు అంటూ కరప ఎస్ఐ టి.రామకృష్ణ సిబ్బందితో కల్సి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. మరోపక్క సంప్రదాయబద్ధం, చట్టానికి లోబడి సంక్రాంతి పండగ జరుపుకోవాలని సూచనలు చేయడంతో పలు గ్రామాల్లో కోడిపందేలు, గుండాటలు జోరుగా సాగాయి. యువకులు, పెద్దలు, పిల్లలు కోడి పందేలలో పాల్గొని భోగిపండగను ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకున్నారు.

సర్పవరంలో..

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం గ్రామంలో రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయంలో గోదా కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం వరకు అర్చకులు బిక్కవోలు రామకిరణ్, పద్మనాభం అత్యంత ఘనంగా శాస్త్రోక్తంగా గోదాదేవి, భావనారాయణ స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈఓ భీమశంకర్, ఆలయ కమిటీ సభ్యులు జోకా సత్తిబాబు, పుల్ల వీర వెంకట సత్యనారాయణ, ఘంటశాల బద్రీనారాయణ పాల్గొన్నారు. అనంతరం భారీగా హాజరైన భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు.

అంగరంగ వైభవంగా నిర్వహణ



కరప విష్ణాలయంలో నిర్వహిస్తున్న గోదాదేవి కల్యాణం

కరప: స్థానిక విష్ణాలయంలో ఆదివారం రాత్రి గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే వేణుగోపాలస్వామికి అభిషేకాలు, తులసి దళాలతో ప్రత్యేక పూజాకార్యక్రమాలు, లక్ష్మీదేవి ప్రతిరూపమైన గోదాదేవి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. వేణుగోపాలస్వామివారిని పెండ్లికుమారునిగా, గోదాదేవిని పెండ్లికుమార్తెగా అలంకరించి, ప్రధాన అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాల కృష్ణ, సూర్యనారాయణ, వాడపల్లి దీక్షితులు వేదమంత్రోచ్చారణలతో, మేళతాళాలతో వైఖానసాగమ ప్రకారం కల్యాణ క్రతువుని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి కల్యాణ వేడుకలు తిలకించారు. పెనుగుదురులోని విష్ణాలయంలో ధనుర్మాస సందర్భంగా గోదాదేవి కల్యాణాన్ని అర్చకస్వాములు గోవర్ధనం సూర్యనారాయణాచార్యులు, వేణుగోపాలాచార్యులు నిర్వహించారు. ఈఓలు తిరుమలరాజు, పీఎస్ఆర్‌వీ సూర్యనారాయణరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు పెద్దింటి సీతారామాచార్యులు గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని గోదాదేవి కళ్యాణ వేడుకలలో పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి జ్యోతి దర్శనం

బోట్‌క్లబ్: రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో సంక్రాంతి సందర్భంగా సోమవారం అయ్యప్పస్వామి జ్యోతి దర్శనం ఏర్పాటు చేసినట్లు ఆలయ పర్సన్ ఇన్‌చార్జి గోపాలకృష్ణ ఆదివారం విలేకర్లకు తెలిపారు. ఉదయం స్వామికి పూజలు నిర్వహిస్తామన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



కరప హైస్కూలులో సమావేశమైన 1990-91 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1990–91 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు కలుసుకుని సందడి చేశారు. 33 వసంతాల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు పలకరించుకుంటూ, కరచాలనం చేసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. స్నేహితులందరూ కలుసుకుని ఆనాటి ముచ్చట్లు చెప్పుకుంటూ ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. ఆ బ్యాచ్‌కు చెందిన పెంకే సత్తిబాబు, కూనపురెడ్డి వీర్రాజు, దేవు వెంకటేశ్వరరావు, పబ్బినీడి వెంకటేశ్వరరావు, పెదిరెడ్డి శ్రీరామకృష్ణ, కె.ప్రసన్నకుమార్ కమిటీగా ఏర్పడి తమతోకలిసి చదువుకున్న విద్యార్థుల చిరునామాలు సేకరించి, వారికి సమాచారం అందించి అందరూ కలిసేలా ఏర్పాటు చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులను పిలిచి సత్కరించారు. ముందుగా హైస్కూలు ఆవరణలోని పాఠశాల అభివృద్ధి ప్రదాత నక్కా సూర్యనారాయణమూర్తి, అల్లూరి సీతారామరాజు, స్వామివివేకానంద విగ్రహాలకు పూర్వ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైభవంగా గరుడ వాహన ఊరేగింపు

కిర్లంపూడి: మండలంలోని గోనేడలో ఆదివారం గరుడ వాహన ఊరేగింపు మహోత్సవం వైభవంగా జరిగింది. గోనేడ పెద్దరామాలయానికి గ్రామస్తుల ఆర్థిక సహాయంతో తయారు చేయించిన గరుడ వాహనానికి ప్రత్యేక పూజలు చేసి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. వేలాది మంది భక్తులు పాల్గొని సందడి చేశారు. అలాగే ఈ నెల 22న ఆయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని ఇంటింటికీ అక్షతలు, కరపత్రాలు పంపిణీ చేశారు.

గోనేడలో నూతన గరుడ వాహనాన్ని ఊరేగిస్తున్న భక్తులు →



కోడిపందేలపై పోలీసుల దాడి

10 మంది అరెస్ట్

కరప: మండలంలో పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడిపందేలు, గుండాట శిబిరాలపై కరప పోలీసులు దాడిచేసి 10 మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.6,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. కరప ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలో గురజనాపల్లి, గొర్రిపూడి, పెదకొత్తూరు, విజయరాయుడుపాలెం గ్రామాల్లో చట్టవిరుద్ధంగా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు సమాచారం అందడంతో ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. గొర్రిపూడి, గురజనాపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడిపందేలలో నలుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకుని నాలుగు కోడిపుంజులు, 8 కోడికత్తులతో పాటు రూ.2,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. పెదకొత్తూరు, విజయరాయుడుపాలెం, గురజనాపల్లి, వేములవాడ గ్రామాల్లో గుండాట నిర్వహిస్తున్న ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.4,400 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

పూలే విగ్రహం సాక్షిగా.. స్థలం ఆక్రమణకు యత్నం

- అడ్డుకున్న నగరపాలక సంస్థ
- టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

కాకినాడ సిటీ: ప్రభుత్వం బాలికల పాలిటెక్నిక్ కళాశాల ప్రహరీని ఆనుకొని ఉన్న స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కొందరి ప్రయత్నానికి అడ్డుకట్ట పడింది. దీనిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు కొందరు వ్యక్తులు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పూలే విగ్రహాన్ని తరలించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ దుష్ప్రచారానికి దిగారు. వివరాల్లోకి వెళితే.. జీపీటీ వద్ద గతంలోనే జ్యోతిరావ్‌పూలే విగ్రహాన్ని నెలకొల్పారు. తాజాగా అదే విగ్రహాన్ని ఆనుకొని బీసీ నేతలుగా చెప్పుకునే కొందరు మరో దిమ్మ ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వేసే ప్రయత్నం చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు అక్కడి డ్రైనేజీని ఆక్రమించి చేస్తున్న నిర్మాణంపై జీపీడీ ప్రిన్సిపాల్ టీవీ రాజశేఖర్ నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగానికి ఫిర్యాదు చేశారు. వెంటనే టౌన్ ప్లానింగ్ సిబ్బంది అనధికార నిర్మాణాన్ని తొలగించే ప్రయత్నం చేశారు. గతంలో పెట్టిన పూలే విగ్రహానికి ఎటువంటు నష్టం లేకుండా తాజాగా చేస్తున్న అక్రమ నిర్మాణానికి మాత్రమే అడ్డుకట్ట వేశారు. దీంతో కంగుతిన్న సదరు వ్యక్తులు కట్టడం నిలుపుదల వెనుక ఎమ్మెల్యే ద్వారంపూడి ఉన్నారని, విగ్రహాన్ని తరలించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ తప్పుడు ప్రచారానికి దిగారు. మరోవైపు టౌన్ ప్లానింగ్ అధికారులు ఫిర్యాదు మేరకు అక్రమ నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నించిన వ్యక్తులపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం వీరిపై తగిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ పోలీసులు చెప్పారు.



పూలే విగ్రహం పక్కన అక్రమంగా నిర్మిస్తున్న దిమ్మను తొలగించిన ప్రదేశం

విగ్రహాల పేరుతో రాజకీయాలు వద్దు

విగ్రహాల పేరుతో రాజకీయాలు చేయడం మానుకోవాలని వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు అల్లి రాజబాబు, యాదవ సంఘ అధ్యక్షుడు మన్నే నాగేశ్వరరావు, నగర బీసీ సెల్ అధ్యక్షుడు పేర్ల రజనీకుమార్, మత్స్యకార నాయకులు చక్రవర్తి హితవు పలికారు. ఆదివారం వీరు విలేకర్లతో మాట్లాడుతూ జీజీహెచ్ సమీపంలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చేసిన కృషిని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కొంతమంది రాజకీయ స్వార్థంతో చేసే దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు.

గ్రామాల్లో విస్తృతంగా సెబ్ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విస్తృతంగా దాడులు చేసి వంద లీటర్ల సారా, 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో మోటారు బైక్‌పై సారా తరలిస్తున్న బొందలపు రమణను అదుపులోకి తీసుకుని, అతని నుంచి బైక్‌తో పాటు వంద లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో రీసు రాఘవపై కూడా కేసు నమోదు చేశారు. పెద్దిపాలెం సమీపంలో సారా స్థావరాలపై దాడులు చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 1000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. శంఖవరం మండలం శృంగధార గ్రామంలో గూడెం లక్ష్మిని అదుపులోకి తీసుకుని, ఆమె నుంచి 14 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు, హెచ్‌సీలు వెంకన్నదొర, కృష్ణార్జున తదితరులు పాల్గొన్నారు.

మైక్‌సెట్ బహూకరణ

కిర్లంపూడి: జగపతినగరంలోని కాపుల రామాలయానికి రూ.42 వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను చదలవాడ బాబీ, మహాలక్ష్మి దంపతులు బహూకరించారు. ఈ మేరకు ఆదివారం రామాలయం ఆలయ కమిటీ సభ్యులకు మైక్‌సెట్‌ను అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువా, పూలమాలతో దాతలను సత్కరించారు. కార్యక్రమంలో లంక మూర్తి, పబ్బిరెడ్డి అర్జున్, అప్పికొండ కొండబాబు, నక్కా అప్పలరాజు, నక్కా రమణ, యామన సత్తిబాబు, మాదిరెడ్డి గణపతి, కరణం అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మోటారు బైక్ దగ్ధం

ఏలేశ్వరం: పట్టణంలో బజాజ్ పల్సర్ (ఎన్ఎస్ 220 మోడల్) బైక్ అకస్మాత్తుగా దగ్ధం కావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానిక దిబ్బలపాలెనికి చెందిన సిద్దు అనే యువకుడు పాతఅడ్డతీగల బస్టాండ్ వినాయకుని గుడి ఎదురుగా కర్రి పాయింట్ వద్ద బజాజ్ పల్సర్ బైక్‌ను పార్కింగ్ చేశారు. బైక్ నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి దగ్ధమైంది. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రత్నించారు. కాగా అప్పటికే బైక్ దగ్ధమైంది. కాగా ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.



మంటలను ఆర్పుతున్న స్థానికులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పిఠాపురం: ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి పండగ చేసుకుంటే వారు మాత్రం తమ పాత స్నేహితులను కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గొల్లప్రోలు ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 1995–96 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకుని అలనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన 30 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడిగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెనుపోతుల శ్రీనివాస్, బసా మాణిక్యాలు, బసా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన షటిల్ టోర్నమెంట్

గోకవరం: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని రంపయర్రంపాలెంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న షటిల్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో అడ్డతీగలకు చెంది నికిల్, వసంత్‌లు విజేతలుగా, ఇందుకూరుపేటకు చెందిన సాయి, వినయ్ రన్నరప్‌గా నిలిచారు. జూనియర్స్ విభాగంలో గణేష్, ఉమ విన్నర్స్‌గా, అర్జున్, చరణ్‌తేజ రన్నర్స్‌గా నిలిచారు. విజేతలకు సంఘం అధ్యక్షుడు చిక్కం దొరబాబు, ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల రాజు, ఆర్థిక కార్యదర్శి నవనాసి చలపతిరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చిక్కం సతీష్‌బాబు, కర్రి నూకరాజు, కాకర విష్ణు, పాటి అపపలరాజు, నందం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగ్గుల పోటీలు

సామర్లకోట: స్థానిక 6వ వార్డు శారదాదేవి ఎలిమెంటరీ పాఠశాల వద్ద ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. భోగి పండగను పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం వార్డులో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో సుమారు 200 మంది పాల్గొన్నారు. ప్రతీ ముగ్గు ఒకదానితో ఒకటి పోటీ పడే విధంగా ఉండటంతో 10 మందిని ఎంపిక చేసి వారికి చీరలు బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ మాట్లాడుతూ 10 ఏళ్లుగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు ఇచ్చారు. తాతపూడి రాజు, చల్లాబత్తుల శ్రీను పాల్గొన్నారు.

భోగి గణపతి బ్రహ్మోత్సవం

బోట్‌క్లబ్: స్వయంభూ కాకినాడ భోగి గణపతి పీఠంలో 17వ వార్షిక బ్రహ్మోత్సవ ఆరాధన ఆదివారం ఎంతో వైభవంగా నిర్వహించారు. తొలుత గోవు పిడకలు పేర్చి ఆవునెయ్యితో భోగి మంట వెలిగించి గోక్షీరాన్ని పొంగించారు. ప్రదక్షణలు చేసిన భక్తులకు తీర్థం అందించారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపక ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ రెండేళ్ల అనంతరం ఏడాది కాలం దేశాటన చేసి అనాథల ఆశ్రయం కోసం రెండు ఎకరాల ప్రాంగణంలో గణపతి పీఠం ఆధ్వర్యాన స్వచ్ఛందంగా విశ్వంభర ఆశ్రమం ఏర్పాటు చేసే సత్సంకల్పం చేపట్టామన్నారు. వినాయకచవితి రోజున చందనం రంగు వస్త్రాలతో 18 రోజుల మాలధారణ వహించే గణేశ దీక్షాపరులతో తిరుమల బస్సుయాత్ర చేపడుతున్నామని తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో భోగి గణపతి



భోగి గణపతి పీఠంలో బ్రహ్మోత్సవంలో పాల్గొన్న భక్తులు